# కథ

# పాలూ-పంచదారా...!

వేద ప్రభాస్

రాముల నాయుడికి గబుక్కున మెలుకువ వచ్చేసింది.

కడుపు పొంగిపోతున్నట్టనిపించి బాత్ రూంకి వెళ్ళేడు. తిరిగొచ్చేక, మరి నిద్దర రాలేదు. చుట్ట వెలిగించి, పెదాల మధ్య ఇరికించేడు. నాగరత్నం, మంచానికి అవతల పక్క నోరు బాగా తెరిచి, గురకలు తీస్తూ నిద్రపోతోంది. చుట్ట పొగ వొదుల్తూ, కళ్ళు అరమూసిన రామునాయుడికి తన ఆరోగ్యం మీద బెంగ, పెరట్లోని ఆనపపాదుల్లా అల్లేసుకుంది. కడుపు కుడి చేత్తో రాసుకున్నాడు. ''ఏటో అయిపోతన్నాది గావాల... లోన... కానుకోలేకందున్నాను.. నడిరాత్రేల ఒంటేలు కిన్ని సుట్లెందు కొస్తన్నాది... కేంసరు గానీ అట్టుకుందేటో''.

కేంసరు ఆలోచన రాగానే, రామునాయుడికి భయం వేసింది.

ఏభై ఏళ్ళుదాటిన రామునాయుడికి అనారోగ్యం అంటే తెలీదు. పిల్లల్లేకపోయినా, అతనికీ, నాగరత్నానికీ కూడా ఆ విషయమ్మై ఎటువంటి బాధా లేదు.


అనారోగ్యం ఏనాడూ దరిజేరని అతగాడికి గత వారం రోజులుగా నిద్ర సరిగ్గా పట్టడం మానేసింది.

చుట్టపారేసి, మంచంమీద వాలేడు రామునాయుడు. నిద్ర రాలేదు సరికదా... అతనికి ఉన్న ట్టుండి, కళ్ళు చీకట్లు కమ్మేయి. తల గిరగిర తిరుగుతున్నట్టనిపించింది.

''సచ్చిపోతున్నాను గావాల'' అనిపించి, చెయ్యి చాచి, నాగరత్నాన్ని తట్టిలేపేడు. ''రత్నం... వొలె రత్నం... లెయ్యే...'' అని నాలుగుసార్లు లేపితే, ఒక్కసారి కదిలింది.... కళ్ళు తెరవకుండానే, ''నీకేటి పొయ్యేకాలం... నడి రేత్రికాడ, నీసాని బుద్ధులు నాకాడేటి సాగవు. నీ కెల్లినేల్లు ఎవడి కెల్లేయి. సిగ్గుండాల... నోర్మూసుకుని తొంగుండిపో... రత్నం... రత్నం... అని మళ్లీ గోకీ నావంటే బాగుండదు'' అని అటువైపు వొత్తిగిల్లింది.

రామునాయుడికి మంటెక్కిపోయింది. ''ఏటే... ఏటేటపేల్తన్నావు...? మొగుడు పిలస్తంటే, ఎందుకో, ఏటో అని ఆలోసించకండ, నోటికేదొస్తే అది పేల్తన్నావు...'' అని నాగరత్నం పిర్ర మీద గట్టిగా చరిచేడు.

గబుక్కున లేచిపోయింది నాగరత్నమ్మ. మంచంమీద నిటారుగా నిలబెట్టిన మేకులాగా, కూర్చుని ''నన్నొదిలిపెట్టెల్లిపోనావె అత్తా...! అత్తా!! ఈ మాయదారి మొగుడికి నన్నప్పజెప్పేసి నావే అత్తా...! అత్తా...!!'' అని వొయినాలు వొయినాలుగా ఏడ్వటం మొదలు పెట్టింది.



బెంబేలెత్తిపోయాడు రామునాయుడు "ఓ పొల్ల కేయే... ఓసోస్... వొల్లకుండిపోయే... నిన్నేటి సేస్సేనే... ఏడకు... ఏడకు" అని గడ్డం పట్టుకుని, బతిమాలాడేడు.

ఏడు పాపి, తీక్షణంగా మొగుణ్ణి చూస్తూ అడిగింది నాగరత్నం.

"నీ మనసులో ఏటీనేకపోతే... నీకేటి అవసరం అనుకోకుంటే, ఈ నడి రాత్రేల నన్నెందుకులేపినట్టు... నాకది సెప్పేప్పుడు... నాకది కావాల.." కుడి అరచేతిలో ఎడమ పిడికిల్తో గుద్దుతూ అడిగింది.

"ఓసినీయమ్మ... నా కొంట్లో ఏటో అయిపోతున్నట్టున్నాదని లేపినానే! తప్పయిపోనాదే!! నా బాదకి నన్నొగ్గేసి నువ్వు పల్లక తొంగుండిపో... సేసిన్నద్దర పాల్పట్టున్నాది.." కసిగా అన్నాడు రామునాయుడు.

నాగరత్నం పడుక్కుండి పోయింది. ఐతే, పడుక్కునే ముందు ఓ మాట అడిగింది "ఏట్టైందేటి?" అని.

"బుర్ర తిరిగి పోతున్నట్టున్నాదే..." కొంచెం బాధగా అన్నాడు రామునాయుడు.

"ఓసోస్... దానికేనా... నీ బుర్ర తిరుగుడి సంగతి నీకిప్పటికీ తెల్సినట్టున్నాది.. ఊరందరిమందికీ ఎప్పట్నుంచో తెల్సు... గానీ కల్లు మూసుకుని తొంగుడడిపో... గొల్లేటి సెయ్యకు" అనేసింది.

రామునాయుడికి దుఃఖం వొచ్చింది.

రామునాయుడికి కోపం కూడా వొచ్చింది.

దుఃఖం వచ్చి, కోపం కూడా వచ్చేక, రామునాయుడికి ఏం కావాలంటే అది చెయ్యగలిగే బలం దానంతట అదే వస్తుంది.

అందుకు అతని చిన్నప్పుడే సాక్ష్యం ఉంది.

***

రామునాయుడికప్పుడు మూడేళ్లు. పుట్టు వెంట్రుకలు ఇంకా తియ్యకపోవటంతో, భుజాల దాటి పెరిగి పోయిన జుత్తు వెంకటేశ్వరస్వామి జడలు కట్టేసి ఉండేది. తన తలమీద ఎవరైనా చెయ్యి వేస్తే, చిన్న రామునాయుడికి ఎక్కడ లేని కోపం వచ్చేది. మీద పడి రక్తం వొచ్చేలా కరిచేసే వాడు. ఇరుగుపొరుగూ రాము నాయుడి తల్లి నోటికీ జడిసి, వీడికి 'పిచ్చ'ని రహస్యంగానే తీర్మానించు కుని, తమ పిల్లల్ని రామునాయుడికి దూరంగా ఉంచేవారు. దాంతో వీధిలో ఎక్కడ పడితే అక్కడ, చీమిడి కారుతున్న ముక్కుతో, చిన్న చెడ్డీతో చిన్నరామునాయుడు యధేచ్ఛగా విహరించేవాడు.

తండ్రి సోమునాయుడికి, కొడుకంటే ముద్దెక్కువ. కొడుకు చురుకుదనం చూసి మురిసిపోయే వాడు రెండకరాల భూమీ, రెండు గేదెలూ, సోమునాయుడి ఆస్తి... తల్లి పాల దశ దాటేక, రాము నాయుడికి గేదె పాలు అలవాటయ్యేయి. గోచీ పెట్టుకుని, తండ్రి గేదెల్ని గడ్డి వెంటితో తోముతూ ఉంటే అతనికి ఆశ్చర్యంగా ఉండేది. నల్లటి గేదెల్నుండి తెల్లటి పాలు తండ్రి పితుకుతూ ఉంటే, తండ్రి భుజాన్నానుకుని నిలబడి తదేకంగా చూసేవాడు.

సోమునాయుడికి కొడుకల్లా నోట్లో వేలు పెట్టుకుని నిలబడి చూడటం ముచ్చటగా ఉండేది.

"ఏటొరేయ్... నువ్వు గానీ పిండుతావేట్రా...? దా... ! దా...!! ఏదీ నీ సెయ్యిటు తే... నేరుస్తువు" అని ముద్దుచేసేవాడు.

ఓ రోజు వామామూలుగానే, గోచీ పెట్టుకుని, వీధిలో గేదెని తోముతున్నాడు సోమునాయుడు.... రామునాయుడు తండ్రి పక్కనే నిలబడున్నాడు. చాకలి సోవులు రేవు నుండొస్తూ "ఏటి బావూ... బొట్టిడికి గేది పాలు అలవాటైనట్టున్నాది. కసిన్ని గాడిద పాలు గానీ ఇచ్చేదేటి?" అని అడిగేడు.

రామునాయుడు చటుక్కున అటు తిరిగేడు. వాడికి తెల్లగా, సాధువులా కనిపిస్తున్న గాడిదను చూసి ఆశ్చర్యం కలిగింది.

"ఏట్రోయ్ సోవులూ, ఆసికాలాడతన్నావేటి...? నడుం మీద చేసి తన్నీగల్ను, నిన్నూ, నీ గాడిదనీ.. జేగర్తగ మాటాడు" అని కళ్ళెర్ర జేసేడు సోమునాయుడు.

"నేనేటి తప్పుమాటన్నాను...? అందరూ గాడిద పాలు కసిన్నియ్యమని నన్నడుగుతారు. పోనీకదాని, నిన్ను నేనూ అడిగినాను. దానికెందుకూ రోసం" అని సణుక్కున్నాడు.

చిన్న రామునాయుడికి వాళ్లిద్దరి సంభాషణ అర్థం కాలేదు గానీ, పాలు అన్న మాట మాత్రం తెలిసింది ఆ పాలు గాడిదవని ఊహ చేసినట్టున్నాడు.

తండ్రి గోచీ పట్టుకు లాగుతూ "అయ్యా పాలే...!" అని గాడిదని చూపుతూ గునిశేడు.

సోమునాయుడు తక్షణమే జరగబోయే రెండు ప్రమాదాల్ని పసిగట్టేడు. ఒకటేమో తిట్టిన నోటితోనే తను సోవుల్ని గాడిద పాలకోసం బతిమలాడ వలసి రావడం. రెండోది, తక్షణమే జరిగేదీ... నడి వీధిలో తన గోచీ ఊడిపోవటం. మొదటిదానికన్న రెండో ప్రమాదానికే అతనెక్కువ కలవర పడ్డాడు. తన మాన సంరక్షణే ముఖ్యం అన్న ఆలోచన వచ్చిందే తడవుగా కొడుకు తలమీద సత్తువ పూరాగా ఫెడీల్మని చరిచేడు. ఆ దెబ్బకి రామునాయుడు తండ్రి గోచీ అయితే వొది లేడు గానీ, వాడికి మొదట దుఃఖమూ, ఆ వెన్వెంటనే కోపమూ తోసుకుంటూ వొచ్చేయి. వాడు వెంటనే ముందుకి వొంగి సోమునాయుడి పిక్కమీద కండ ఊడిపడేలా కరిచేసేడు.

సోమునాయుడికి పై ప్రాణం పైనే పోయినట్టనిపించింది.

"అమ్మ నీ యమ్మ....! సంపీసినావురా... తొత్తుకొడకా...!!" అని కొడుకు జుత్తు పట్టుకుని ఈడ్చ టానికి వొంగేడు. ఐతే అంతవరకూ సోమునాయుడి తోముడుతో సుఖాన్ననుభవిస్తూ, కళ్ళు సగం మూసుకుని, నెమరు వేతతో దవడలాడిస్తున్న గేదెకి సుఖాంతరాయం కలిగి ఎడం కాలు విసురుగా జాడించింది. ఆ దెబ్బ రామునాయుడికి తగలాల్సింది కానీ సోమునాయుడికి తగిలి అతను బొక్కబోర్లా పడిపోయేడు.



అంతలో రామునాయుడి మాతృమూర్తీ, సోమునాయుడి జీవితకాల ప్రత్యర్థి నాగమ్మ జుత్తు ముడేసుకుంటూ, రంగ ప్రవేశం చేసింది.

తల్లిని చూస్తూనే రామునాయుడు "ఓలమ్మ పాలే" అంటూ వొచ్చి కాళ్ళకు చుట్టుకున్నాడు. నాగమ్మకి వొళ్ళు తెలీకుండా పోయింది. పూనకం వొచ్చిన దాన్లా అయిపోయింది.

"నీ పీనాసితనం పాడుగాను... ఒక్కగానొక్క బొట్టిడు... ఆడు పాలడిగితే చేతికొచ్చిన దెబ్బలు కొట్టే

స్తవా...? ఆ గేదెలేటి నీయబ్బ సొమ్ముతో కొన్నాననుకుం టున్నావేటి...? నా కంటీ, సెవి కమ్ములు అమ్మీనేదా...!!" అని నడి వీధిలో సోమునాయుడి పరువు, ప్రతిష్ఠల్ని కోడికి ఈకలు తీసినట్టుగా తియ్యడం మొదలు పెట్టింది.

బోర్లాపడేలా తన్నిన గేదె తన్నుకూ, పిక్క మీద రక్తం వొచ్చేలా కొడుకు కరిచీసినందుకూ, సగం చచ్చి నట్టయిపోయిన సోమునాయుడు, నాగమ్మ సవాళ్ళతో పూర్తిగా కుదేలైపోయేడు.

"ఓసోస్... వొల్లకేయే! ఇప్పుడెందుకా వొల్లాపన్లనీ... ఆడేటడగతన్నాడో నీకేటి తెలుసే..? అడిక్కావలసింది గేదె పాలుకాదే... గాడిద పాలంట.." అని కుంటుకుంటూ వొచ్చి నాగమ్మని శాంత పరిచే ప్రయత్నం చేసేడు.

"ఏటీ... గాడిద పాలడిగినాడా..? అడిగితే మాత్రం అంతలేసి దెబ్బలు కొట్టేస్తవా... ఐనా గాడిద పాలేం పాపం సేసినాయంట సిన్నప్పుడు గాడిద పాల్తాగితే ఉబ్బసే రాదంట... నీకూ నాకూ లేని గేనం ఆడికుంది. పో... పోయి సోవుల్నడిగి అట్టుకొస్తేనే, నీకీ పూట కూడు" అని "రారయ్యా... మీ అయ్య తెస్తాడ్లే" అని కొడుకును చంకనేసుకుని, వాడికిష్టమైన కరకజ్జం కొనిపెట్టడానికి కోమటింటికి బయల్దేరింది.

***

రామునాయుడికి గతం గుర్తొచ్చి బాధ కలిగింది. మాయమ్మే ఉంటేనా... దీన్ని పెల్లాడనిచ్చీదా... అని ఛీత్కరింపుగా నాగరత్నం వంక చూసేడు.

ఈ రోజు నా రోగం సంగతేటో తేల్చుకోవాల... అని నిర్ణయం చేసుకున్నాక, అతనికి కొద్దిగా నిద్ర పట్టింది.

"ఏటీసోకులు... పట్నం ఎల్లన్నట్టున్నావు..? సారా కొట్టుకీ, సాని కొంపలకీ ఎల్లడం మానీసేవనుకున్నాను. మల్లీ మొదలెట్టి నావన్న మాట." అంది నడుం మీద చేతులేసుకుని.

రామునాయుడికి లోపలెక్కడో అగ్నిపర్వతం పేలినట్లయ్యింది. చటుక్కున, పెళ్లాం వంక తిరిగి, తీక్షణంగా చూస్తూ "నోటికేదొస్తే అది పేల్డం నువ్వు మానవా...?" అని అడిగేడు.

నాగరత్నం బెదర్లేదు "నాకేటనిపిస్తే అదంటాను. కాకపోతే కాదని చెప్పు.." అని అధికార పక్షం మీద ఆరోపణలు చేసే ప్రతిపక్ష నాయకుడిలా నిర్లక్ష్యంగా చెప్పింది. ఇంకా "నేనిలాగ లేకపోతే ఈ కుటుమానం ఇలగుండీదేటి?" అని సవాలు విసిరింది.

"నీ కో దండమే... పట్నంలో డాక్టరు కాడికెల్తాన్నావే... శాపాకారాలెట్టీకు" అని రెండు చేతులూ జోడించేడు.

"నువ్వు డాక్టరు కాడికెల్తే నాకేటి...? సినిమా ఏక్టరు కాడికెల్తే నాకేటి..? ఈ రెండు గాకండా మరో సుప్పనాతి పని సెయ్యడానికెళ్తే మాత్రం, నాకు సెప్పే సేస్తన్నావేటి..?" అని మూతి తిప్పుకుంటూ వెళ్ళిపోయింది నాగరత్నం.

కొంచెం లోకజ్ఞానం తెలిసిన మనిషని వొశినాల పాలెం ఊర్లో కంతటికీ పేరున్న వాడూ, వరసకి బామ్మర్ది అయిన సింహాచలాన్ని తోడు దీసుకుని డాక్టరు దగ్గరికి పట్నం వెళ్లేడు రామునాయుడు. ఆ డాక్టరు ఇద్దర్నీ చూసి సంతోషించేడు ముందు ఇద్దర్నీ పేషంట్లనుకుని, తర్వాత కాదు ఒక్కడే అని తెలుసుకుని సంతోషాన్ని సగం చేసుకున్నాడు. పరీక్షలన్నీ చేసేక మధ్యాహ్నం రాము నాయుడికి జబ్బేమిటో చెప్పేడు.

"నాయుడుగారూ! మీ ఇంట్లో ఎవుళ్ళకైనా షుగరు జబ్బున్నాదేటి...?" అనడిగేడు ఆరాగా... ఆ డాక్టరుకి పల్లెటూరు వాళ్లతో వాళ్ళ యాసలో మాట్లాడ్డం ఓ సరదా... దాని వల్ల ప్రాక్టీసు పెరుగుతుందనే ఆలోచన కూడా ఉంది అతన్లో.

ఆ జబ్బు గురించి అంత బాగా తెలీని రామునాయుడు వెంటనే చెప్పేడు "సీ...సీ... సవాయిలూ, సుగరు జబ్బులూ మా ఇంటావంటా లేవండి. మాది జబ్బు లొంశం కాదు. ఏదో జలుబూ జొరవూ లాటివెప్పుడైనా వొస్తాయి గానీండి ఇలాటి ఊరూపేరూ తెలీని జబ్బులు మాకేటీ రానేదు" అన్నాడు.

డాక్టరు దయగా నవ్వేడు.

"షుగరు జబ్బు, సవాయి వేరు వేరులెండి. మొదటిదుంటే రెండోది రాకూడదనేం లేదు. కొందరికి రెండూ ఉంటాయి. మీ కొకటే ఉంది లెండి... సవాయి కాదు... షుగరు జబ్బే.." అని నవ్వుతూనే వివరంగా చెప్పేడు.

రామునాయుడు మొహంలో ఆందోళన గమనించిన డాక్టరు "నాయుడు గారూ బెంగ పడకండి... ఇది జబ్బా అంటే జబ్బనీ కాదు అలాగని ప్రమాదం లేదా అనంటే లేదనీ కాదు" అని కాగితం మీద మందులు రాస్తూ, చెప్పేడు.

"తీపి పదార్థాలు తినడం తగ్గించండి. ఈ మందులు వేసుకుని... రోజూ నాలుగు మైళ్ళు నడిచేరంటే... జబ్బు తగ్గిపోదు కానీ, బాధించదు" అని కూడా బోధ పరచి తనక్కావలసిన ఫీజు తీసుకున్నాడు.

***

రామునాయుడు చిక్కి సగమయ్యేడు ఏది తినాలన్నా ఏది తాగాలన్నా భయపడిపోతున్నాడు. చీకట్నే లేచి చేతులూపుకుంటూ, ఊరవతలున్న దెయ్యాల మర్రి దాకా నడుస్తున్నాడు. మొదట్లో ఓ రెండు రోజులు సింహాచలం వొచ్చేడు గానీ తర్వాత నేను రాలేనని మానీసేడు.

నాగరత్నమ్మ ముభావంగా ఉంటోంది... ఓ రాత్రి వేళ ఖచ్చితంగా చెప్పేసింది "నా దగ్గరికి రాకు. ఎక్కడంటించుకొచ్చిన జబ్బులూ నా కంటించాలనుకుంటున్నావు కామాల. కిరసనాయులు బోసుకుని సచ్చిపోగల్ను. జేగర్త..."

వొశినాలపాలెం ఊరందరికి రామునాయుడి జబ్బు సంగతి తెలిసిపోయింది.

అట్టాడ దేవుడు ఓరోజు పొద్దున్నే దిగబడిపోయేడు... వస్తూనే, "ఏట్రా... దద్దా... నీకేటో పంచదార జబ్బొచ్చినాదంటన్నారు... మరేటీ బెంగెట్టీసుకోక... నా మాటిని కానీ ఎల్లొచ్చీ... ఆనిక టయిముంటాదో నేదో... అందుకే బేగా ఎల్లొచ్చీ.... తోడు రమ్మంటే నేనొస్తాను. నాకూ ఓపాలి కాసీ సూడాలనున్నాది. కర్సులు నీయే... ముందుకంటా సెప్తున్నాను. నేను సిక్కంలోంచి రూపాయి తియ్యను గాక తియ్యను అని చెప్పి, కొంచెం నెమ్మదిగా "కాసీలో పంచదార దానం సేస్సే వంటే, నీ జబ్బు టకామని తగ్గిపోదీ. నాది గేరంటీ. ఆ మద్దినేటయ్యిందనుకున్నావు మా తోడల్లుడు పారినాయుడు లేడూ....కి నీల్లంటే గొప్ప బయ్యిం... తానం కూడ సేసీవోడు కాదు... ఆడి భార్య ఆడిసేత కాసీలో ఏటి దానం సెయ్యించిందనుకొన్నావు... మా ఊరి ఏరు దానం సెయ్యించింది. ఇప్పుడు సూడు ఆడెవలింటికొచ్చినా ముందు తానం జెయ్యాలంటన్నాడు" అని కిస కిస నవ్వేడు.

ఇంకోనాడు ఇంకోడొచ్చి "నేరడి పళ్ళు తింటే తగ్గిపోద్దట...తిని సూడ్రాదా"అని సలహా చెప్పేడు.


'తీపికీ, చేదుకీ చుక్కెదురుగాదా... కాకరకాయ కూర తినమని' ఓ నాయురాలు సలహా ఇచ్చింది. 'కోడిగుడ్డూ, పొట్లకాయ కలిపి వొండమన్నా వొండేస్తాను గానీ కాకరకాయ కూర ససేమిరా నేనొండనంది' నాగరత్నం.

ఇలాగ ఎవరేం చెప్పినా, తలూపే పరిస్థితి రావడం రామునాయుడికి చెడ్డ చిరాగ్గా ఉంది. రోజూ పొద్దున్నే వెళ్ళే మార్నింగ్ వాక్ కూడా అనుకోని అవాంతరం రావటంతో అతనికి మానెయ్యక తప్పలేదు. చీకటితోనే బయల్దేరుతుంటే, రోడ్డు పక్కన చెంబుల్తో కూర్చున్న ఆడవాళ్ళు, తను వెళ్తున్నప్పుడూ, వస్తున్నప్పుడు, వరసగా లేచి నిల్చోవటం, గవర్నరుకి సిపాయీల సైనిక వందనంలా తోచి, సిగ్గుపడి మానీసేడు. నాగరత్నమ్మ కూడా వార్నింగ్ ఇవ్వడం ఇంకో కారణం.

తండ్రి ఇచ్చిన రెండెకరాల పొలాన్నీ మొండి వ్యవసాయం చేసి ఇరవై ఎకరాల దాకా పెంచి వొశినాల పాలెం ఊర్లోకల్లా మోతుబరయ్యేడు గానీ, మొండితనం మాత్రం పోలేదు రామునాయుడికి. తనకొచ్చిన జబ్బు, తగ్గాలంటే ఏదో ఒకటి చెయ్యాలనుకున్న రామునాయుడికి అనుకోకుండా ఓ రోజు పొద్దునే సింహాచలం పరుగులాంటి నడకతో వచ్చి, "బావా, మంచి సంగతొటున్నాది పేపర్లో... నువ్వినాల... అని' ఒంటె పాలు – మధుమేహానికి మందు' అనే వార్తని వినిపించేడు 'ఒంటె పాలు రోజూ తాగితే ఈ జబ్బే ఉండదన్న మాట' అని కూడా వివరించేడు.

రామునాయుడి మొహం ఒక్కసారిగా వెలిగిపోయింది కానీ అంతలోనే వాడిపోయింది.

"నీ సలా సంతకెల్లినట్టే ఉన్నాదిర... ఒంటిపాలెక్కడ దొరకాల్రా... అప్పుడెప్పుడో రేమాండ్ సర్కస్లో ఒంటిల్ని సూడ్డమే, తర్వాత నేను ఒంటినిసూసిందీ లేదు... దామాను ఇన్నదీ లేదు... మన వల్లకాని పనొరే" అని నిట్టూర్చేడు.




సింహాచలం చిలకలా నవ్వేడు "బావా... నీకు ఒంటి పాలు కావాలంటే, నువ్వే ఒంటిని పెంచాల్సప్ప మరో దారి లేదు" అని తన అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియచేసేడు.

"మరి పెంచుకోడానికి ఒంటెక్కడ దొరుకుతుందిరా సివాచెలం... దొరికినా అది పాలిస్తాదో, ఇవ్వదో... మనకి తెల్డ మెలాగా..?"

"నేను తెలుసుకున్నా బావా...! నేనున్న

ద్దేనికయితే...? రాజస్తాన్లో పుస్కరంట ఆడ ఒంటెల సంత జరుగుతాదట... నీక్కావలిస్తే అక్కడకెల్లి తెచ్చేడమే...''

రామునాయుడు కాసేపు ఆలోచించేడు ''నువ్వు రేపు రా..'' అని సింహాచలానికి చెప్పేడు.

మర్నాడు సింహాచలం రాగానే, అతన్ని ధాన్యం గదిలోకి తీసుకెళ్లి తలుపేసేడు. తప్పుడు సలహా ఇచ్చేవని తంతాడు కాబోల్రా అని ముందు కాస్త జడిసినప్పటికీ ''బావా... నువ్వేటి సేస్తావో... మరెలాగ సేస్తావో నాకుతెలీదు నువ్వెళ్లి ఒంటెన్దెచ్చేయాల... ఇదుగో స్టేటు బేంకు ఏటీయం కారుడు.. నీ సేతిలుంచున్నాను. నాకు డబ్బు కాతర నేదు. నా పసువుల సాల్లో ఒంటుండాల. వోల్ జిల్లా మొత్తం మన పేరు మోగిపోవాల... ఈపని నువ్వే సెయ్యాల. ఇంకేటి కావాలన్నా అడుగు'' అన్నాడు.

సింహాచలానికి హుషారొచ్చింది.

''నీకేటి కావాలో నాకు బోధైంది. బావా నువ్వు నింపాదిగుండు... నీ సాల్లో ఒంటిని కట్టేసే పూచీ నాది. నేను ఈ రోజే బయల్దేరుతాను. అన్నట్టు నేనొచ్చే సరికి సాల ఎత్తు జేయించు. లేకపోతే ఒంటికి సాల్దు'' అన్నాడు. అంతలోనే మరేదో జ్ఞాపకం వొచ్చి ''అన్నట్టు మర్సిపోయేను బావా... నాకు ఇందీ రాదు గదా... నువ్వో పన్చెయ్యి... మనూరి బళ్ళోని హిందీ మేస్టర్ని కూడా నాతోని పంపు. ఆడికే మాలావు ఇందీ వొచ్చని చెడ్డ గుర్రాగున్నాది. సంగతి తేలిపోద్ది'' అని చెప్పేడు.

రామునాయుడు హిందీ మేష్టరికి కబురు పెట్టేడు.

హిందీ మేష్టరు, పుస్తకాలు చూసి పరీక్షలు రాసి పాసైన వాడవ్వటం వల్ల హిందీ వాచకంలో భాషే వొచ్చునుగానీ హిందీ అసలేం రాదు. మిగతా మేష్టర్లకి అదీ రాదు కనుక ఏదో చెలామణీ అయిపోతున్నాడు రామునాయడు కబురు పెట్టేసరికి, అతను కొంచెం వొణికేడు. హెడ్ మేష్టర్ని సలహా అడిగేడు.

''నిన్నెందుకు రమ్మన్నాడో నాకేం తెలుస్తుంది...? ఏదో సున్నం పిడత పని చేసుంటావు. ఐనా ఈ మధ్య నీ ప్రవర్తనేం బావుండడం లేదు. నేనప్పటికీ చెప్తూనే ఉన్నాను. పిల్లల్తో గట్టిగా బయటికి చదివించకూ. ఆ హిందీ మాటలు బూతుల్లా ఉన్నాయి అని... నువ్వు వింటే కదా...! ఇదుగో ఇప్పుడు చూడు అన్నట్టు ముందే చెప్తున్నా. నీ పన్లకు నీదే బాధ్యత. స్కూలుకేం సంబంధం లేదు. గుర్తు పెట్టుకో...'' అని హెడ్ మేష్టరు తద్దినం మంత్రం చదవినట్టు చెప్పేడు.

***

''ఒంటెన్దెచ్చినాడంట రామునాయుడు'' అన్న వార్త వొశినాల పాలెంలోనే కాకుండా చుట్టు పక్కలంతా మారుమోగిపోయింది.

ఊరు ఊరంతా తిరణాలైపోయింది. కోమటి సూర్యం, రామునాయుడికి ఇంటి దగ్గర్లో, పెసర పుణుకులూ, జంతికలూ, పుల్లట్ల దుకాణం వొకటీ, సోడా, మజ్జిగా, షరబ్బత్తుల దుకాణం వొకటీ తన కొడుకుల్తో ఎందుకైనా మంచిదని పెట్టించేడు. చూడ్డానికి టిక్కెట్టు పెట్టాలన్న ఆలోచన వొకటి మెరుపులా మెరిసింది. కానీ, ఒంటె రామునాయుడిది కానీ తనది కాదని గుర్తొచ్చి ఖిన్నుడై పోయేడు.

నాగరత్నం, మొగుడు తనతో మాట మాత్రం చెప్పకుండా అంత పని చేసినందుకు తిట్లతో నలుగు పెట్టాలనుకుంది కానీ, వోల్ పరగణా మొత్తం మీద తమ కుటుంబానికి గొప్ప పేరు వస్తున్నందుకు ఊరుకుండిపోయింది.

ఒంటె దిగింది. ఊరు చివర లారీ లోనుండి ఒంటెని దింపేరు. పదడుగుల పొడవూ, ఎనిమిది అడుగుల ఎత్తూ ఉన్న ఒంటె లారీ నుండి దిగీ, దిగగానే నెమ్మదిగా తలతిప్పి కాటుక పెట్టినట్టున్న చిన్న కళ్ళతో చుట్టూచూసింది. వీపు మీదున్న మూపురాన్ని ఒక్కసారి విదిలించింది. గోధుమ రంగులో శరీరమంతా బొచ్చన్నది లేకుండా నిగనిగ మెరిసిపోతున్న ఒంటె ముందు దిగేక, వెనకాతలే అయిదడుగుల ఎత్తులో ఉన్న ఒంటెపిల్లని కూడా దించేరు. ఊరు, ఊరంతమందీ అక్కడే చేరి పోయేరు.

సింహాచలం, హడావుడి చేస్తున్నాడు ''జరగండి... జరగండి... దూరం... దూరం. ఒంటి బెదిరి పోగల్దు'' అని ఒంటె చుట్టూ తిరిగేస్తున్నాడు హిందీ మేష్టరు, పెద్దమనిషి తరహాలో చిరునువ్వులు చిందిస్తూ నిలబడ్డాడు. అతని మనసులో వొశినాలపాలెం జనాన్ని సంపూర్ణ ఉత్తర దేశ యాత్రలకు తీసుకెళ్ళే ప్లానులు చకచకా తిరిగేస్తున్నాయి.

సింహాచలం, హిందీ మేష్టరు వంక నిరసనగా చూసేడు.

చుట్టూచేరిన జనాన్ని విసుగ్గా చూసి
''కారే... సిమ్మాచ్చీ... తన్నె కాన్
బతాయో'' అని అరిచినట్టుగా
అన్నాడు.
''ఏటంటన్నాడ్రా... అడు...? ఇంతకీ
అణ్ణెందుకు తెచ్చినావురా...! మీసాల
పోతునాగున్నాడు... ఊళ్ళో పిల్లలు
జడుపట్టి పోగల్రు'' సింహాచలాన్ని
విసుగ్గా అడిగేడు రామునాయుడు.
బావ తన తెలివితేటల్ని గుర్తించనందుకు
బాధ పడ్డాడు సింహాచలం

''నిలబడింది. సాల్లే.. ఆడి తోటి చెప్పు... ఒంటిని బావ ఇంటికి తోలుకురమ్మని'' అన్నాడు.

లారీ కేబిన్లోంచీ అప్పటికే ఆరడుగుల పొడుగున జాట్ ఒకడు దిగేడు. మొహం నిండా గుప్పెడంత లావు ఉన్న మీసాలు పైకి మెలితిప్పినవి ఉన్నాయి. తలకి రాజస్థాన్ స్టైలో తలపాగా ఉంది. లారీ నుండి దిగుతూనే ఒంటె దగ్గరకిపోయి, దాని కడుపు మీద రాసేడు. ఒంటె పిల్లని ముద్దు చేసేడు.

చుట్టూచేరిన జనాన్ని విసుగ్గా చూసి ''కారే... సిమ్మాచ్చీ... తన్నె కాన్ బతాయో'' అని అరిచినట్టుగా అన్నాడు.

''ఏటంటన్నాడ్రా... ఆడు...? ఇంతకీ ఆణ్ణెందుకు తెచ్చినావురా...! మీసాల పోతునాగున్నాడు... ఊళ్ళో పిల్లలు జడుపట్టి పోగల్రు'' సింహాచలాన్ని విసుగ్గా అడిగేడు రామునాయుడు.

బావ తన తెలివితేటల్ని గుర్తించనందుకు బాధ పడ్డాడు సింహాచలం ''బావా... ఒంటెన్దెచ్చినాం మనం... మేకనో, జెర్సీ ఆవునో గాదు. మనకి దాని గురించేటీ తెల్దు... పాలిస్తదో.. ఇవ్వదో... ఇస్తే ఎన్నిస్తాదో, ఎన్ని సార్లిస్తాదో, మేత ఏటి తింటాదో, కుడితి నీల్లు, బియ్యం కడుగు నీల్లు తాగించొచ్చో లేదో మనకేటీ తెలుస్తాది... అందుకే ఆణ్ణి దెచ్చినా... ఒంటె ఆడిదే..''

''ఆడు మన్ని దినీసీలాగున్నాడ్రా సివాచెలం...అందుకే అడిగాను గానీ, నువ్వేటీ అనుకోకు. మరయితే ఆడి బాస మనకీ, మనబాస ఆడికీ రాదు గదా... ఆ హిందీ మేస్టరుతో సెప్పి ఒంటెని సాల్లోకి దెచ్చేమను. ఊరందరూ ఇరగబడీ పోతున్నారు. మద్దేన పేళకి మరెంతమందొచ్చి పడిపోతారో తెలీకుండున్నాది... అప్పుడే ఎమ్మెల్యే కాణ్ణుండీ, మండల పెశిడెంటు కాణ్ణుండీ ఫోన్లొచ్చెయి ఆళ్ళకీ పాలు కావాలంట... వాడిక పెట్టమంటన్నారు..''

''ఒక్కడేంటి బావా... ఇక నుండీ జనం నీ ఇల్లు కుమ్మేస్తారు... చూస్తూండు. ఈ ఒంటె వొచ్చినేళ అలాటిది. నువ్వింక ఒంటెల ఫారం ఎట్టెయ్యాల... దేవుడి సెలవు'' సింహాచలం హుషారుగా అని

''సెప్పవయ్యా మేస్టరూ... ఒంటెని సాల్లోకి తెచ్చేమను...ఇనబడ్డంలే'' అని హిందీ మేష్టర్ని కసిరినట్టుగా అన్నాడు.

హిందీ మేష్టరు ఒంటె దగ్గరున్న జాట్ దగ్గరకి పోయి సైగల్తో, విషయం చెప్పేడు.

''తన్నెకున్ సీ కథా సునాయీా....'' అని విసుక్కుంటూ, అతను ఒంటెని మెల్లిగా నడిపిస్తూ కదిలేడు.

మందగమనంతో చుట్టూ చూస్తూ ఒంటె ముందుకు కదిలింది.

దాని అడుగుల్లో అడుగులు వేస్తూ ఒంటె పిల్ల కూడా...

రామునాయుడికి మనసులో ఆనందం వరదలా వెల్లువైంది. సంతోషం సముద్రంలా ఉప్పొంగింది. ఒక్కడుగు ముందుకు వేసి, ఒంటె దగ్గరకి రాగానే యజమాని హోదాలో, దాని కడుపు మీద చెయ్యివేసి మృదువుగా రాసేడు.

అంతే... ఒంటె దెయ్యంలా అరిచింది. రామునాయుడి మీద ఆకు పచ్చగా లప్పెడు ఉమ్మి వేసి, నాలుగుకాళ్ళతో గంతులు వేస్తూ ఎడం కాల్తో రామునాయుణ్ణి జాడించి తన్నింది.

***

విరిగిపోయిన కాలరు బోనుకు ట్రీట్‌మెంటు తీసుకుంటూ వారం రోజుల తర్వాత, హాస్పటల్లో కళ్ళు తెరిచిన రామునాయుడికీ, మంచం పక్కనే బత్తాయి పండు వొలుచుకు తింటూ నాగరత్నం కనిపించింది.

''ఏటలాగ సూస్తన్నావు...? ఈ పళ్ళేటీ నువ్వు తిన కూడదు. ఒంటిన్తగిలీపినాను నీకా పాలూ వొద్దు. పంచదారా వొద్దు... మరే ఆలోసనన్నా సేసినావంటే పీక పిసికి సంపుతాను... సీ... సీ... సిగ్గు... సిగ్గయిపోయింది'' అంది హెచ్చరిస్తున్నట్టు.

బావకి మెలుకవ వొచ్చిందని తెలిసి, షుగరు జబ్బు శ్రీశైలం అడవుల్లో ఉండే జెముడు కాకి మాంసం తింటే తగ్గిపోతుందని పొద్దున్నే పేపర్లో చదివిన సంగతి చెప్పాలని, పరుగు పరుగున వొచ్చిన సింహాచలం నాగరత్నం మాటలు విని ఎందుకైనా మంచిదని పేపరు చొక్కాకింద జాగ్రత్త చేసేడు.

*

చిరునామా:
జె.వి.బి.నాగేశ్వరరావు,
ఫ్లాట్ నెం. 25/బి/జి2, స్వాతి కన్‌స్ట్రక్షన్,
భాగ్యనగర్, విజయనగరం,
ఫోన్: 94907 91568.